క్లుప్తంగా

నేడు సచివాలయాల ప్రారంభోత్సవం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పల్లివూరు, కంబారాయుడుపేట గ్రామ సచివాలయాలను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శనివారం ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పల్లివూరు చేరుకుని అక్కడ బహిరంగ సభలో మంత్రి ప్రసంగిస్తారని, మధ్యాహ్నం 3 గంటలకు కంబాలరాయుడుపేటలో సచివాలయం ప్రారంభోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సిమెంట్ బెంచీల వితరణ


గ్రామంలో ఏర్పాటు చేసిన బెంచీలు

కాశీబుగ్గ: పలాస మండలం కేదారిపురం పంచాయతీ ఈదురాపల్లి, గంగువాడ, కేదారిపురం, కంబిరిగాం గ్రామాలకు రూ.40 వేల విలువైన 14 సిమెంట్ బెంచీలను చినంచల గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త బొత్స మధుసూదనరావు శుక్రవారం వితరణగా అందించారు. ఆయా ప్రాంతాలలో మొక్కలు నాటి రక్షణ ఏర్పాట్లు చేశారు.

గాయత్రి చారిటబుల్ ట్రస్ట్ వితరణ


విద్యుత్ లైట్లను అందిస్తున్న కొర్ల కన్నారావు

మందస: మండలంలోని నారాయణపురం పంచాయతీ కేశుపురం గ్రామానికి గాయత్రి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొర్ల కన్నారావు వివేకానంద యువజన సేవాసంఘం కోరిక మేరకు ఆటస్థలాన్ని బాగు చేయించారు. సాయంత్రం పూట యువత ఆడుకునేందుకు వీలుగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కొంచాడ సురేష్‌కుమార్, మార్పు వెంకటేశం, పులారి మోహనరావు, తిరుపతిరావు, ఖగేశ్ పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

సోంపేట: బీఎల్‌ఓలు సక్రమంగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ కె.విజయ్‌కుమార్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. సమావేశంలో డీటీ గిరి పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం


రక్తదాతకు సర్టిఫికెట్ అందిస్తున్న అధికారులు

పలాస: జాతీయ రహదారి భద్రతా నెలవారీ అవగాహన కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో లక్ష్మీపురం టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 53 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వలంటీర్ చైతన్య, ఆర్.ఇ.నాగేశ్వరరావు, ఐ.ఇ టీమ్, టోల్ ప్లాజా మేనేజర్ సెంథిల్‌కుమార్, అనిష్ జానా, జి.మోహన్,పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్


నమూనా ప్రాజెక్టులను తిలకిస్తున్న స్థానికులు

టెక్కలి: స్థానిక అరుణా విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ప్రధానోపాధ్యాయుడు డి.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శనలో 5 నుంచి 9వ తరగతి విద్యార్థులు పాల్గొని 100 ప్రాజెక్టులు ప్రదర్శించారు.

విజేతలకు నగదు బహుమతులు


విజేతలకు చెక్‌లు అందిస్తున్న డిపో మేనేజర్

కాశీబుగ్గ : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన లక్కీ డ్రా విజేతలకు డిపో మేనేజర్ సీతారామనాయుడు శుక్రవారం రూ.1000 విలువైన నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్వామి, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి బాటలో..!


కొండవూరు- పీఎంపురం రహదారి


ఎస్పీ రోడ్డు-దబ్బలపాడు బీటీ రహదారి

- వజ్రపుకొత్తూరు మండలంలో రహదారులకు మహర్దశ
- కోట్లాది రూపాయలతో రోడ్ల నిర్మాణం



వజ్రపుకొత్తూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వజ్రపుకొత్తూరు మండలంలో ప్రధాన రహదారులు కొత్త కళను సంతరించుకున్నాయి. గత టీడీపీ హయాంలో ఈ ప్రాంత ప్రజలు ఎంత విన్నవించినా అప్పటి ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ ఒక్క బీటీ రోడ్డు కూడా వేయించలేకపోయారు. 12 రహదారులకు శంకుస్థాపన చేసి వదిలేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పంచాయతీరాజ్(పీఐయూ), రోడ్ల భవనాల శాఖ ఆధ్వర్యంలో కొన్ని రహదారులను పూర్తి చేసి భళా అనిపించుకున్నారు. ప్రధానంగా వజ్రపుకొత్తూరు నుంచి కాశీబుగ్గ వరకు 16 కి.మీ ఆర్‌అండ్‌బీ రహదారికి రూ.17 కోట్లు వెచ్చించి పనులు చేపడుతుండగా, అదే రహదారిలో నువ్వలరేవు నుంచి బెండిగేటు మీదుగా రేగులపాడు వరకు రూ.18 కోట్లతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎస్పీ రోడ్డు నుంచి కొత్తపేట తీర ప్రాంతానికి 3.50 కి.మీ రూ.75 లక్షలు వెచ్చించి నాణ్యతతో రహదారి నిర్మించారు. ఎన్‌బీ రోడ్డు నుంచి గుళ్లలపాడు వరకు 2.2 కి.మీ మేర రూ. 97 లక్షలు వెచ్చించి పనులు పూర్తి చేశారు. మండలంలో పీఆర్(పీఐయూ) నుంచి గరుడకండి- మహాదేవిపురం వరకు 1.7 కి.మీ రహదారికి రూ. 39 లక్షలు, ఎస్పీ రోడ్డు నుంచి దబ్బలపాడు 2 కి.మీ రహదారికి రూ.34 లక్షలు, పాతటెక్కలి- యూఆర్‌కేపురం మధ్య 2.13 కి.మీ రహదారికి రూ.49 లక్షలు, యూజీపురం- యు.మెళియాపుట్టి 3.30 కి.మీ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.1.50కోట్లు, కొండవూరు- పీఎంపురం 3.4 కి.మీ రహదారికి రూ.1.80 కోట్లు వెచ్చించి నిర్మించారు. రహదారులు సుందరంగా మారడంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఎస్పీరోడ్డు- కొత్తపేట రహదారి


పాతటెక్కలి- యూఆర్‌కేపురం బీటీ రహదారి

వైఎస్సార్‌సీపీలో 30 కుటుంబాల చేరిక


పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్

కవిటి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం సాధ్యమవుతున్న విశ్వాసంతో వైఎస్సార్ సీపీలో చేరామని చిన్నకర్రివానిపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారులు ప్రకటించారు. శుక్రవారం జగతిలో జరిగిన కార్యక్రమంలో శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ సమక్షంలో 30 కుటుంబాలు పార్టీలో చేరాయి. మోసా వీ రాస్వామి, మోస లోకనాథం, పుక్కళ్ల మాధవరావు, సూర్ని దేవరాజ్ తదితర 30 కుటుంబాలకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జగతి సర్పంచ్ పూడి వరప్రసాద్, ఉపసర్పంచ్ చీకటి భూషరాజు, బావన రవికుమార్, యర్ర శ్యాం, చుక్క జగన్నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి

కాశీబుగ్గ: మినీ డీఎస్సీ కాకుండా మెగా డీఎస్సీ విడుదల చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కాశీబుగ్గలోని సీపీఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ తక్కువ పోస్టులు కాకుండా ఎక్కువ పోస్టులు భర్తీ చేయాలన్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు గోరు వాసుదేవరావు, నాయకులు వల్లభరావు, వెంకటరావు పాల్గొన్నారు.

ఒడియా సినిమా షూటింగ్ సందడి


వాసుదేవ ఆలయం వద్ద చిత్రీకరణలో నటులు

మందస: అఖండ అనాది అనే ఒడియా చిత్రాన్ని మందస వాసుదేవపెరుమాళ్ ఆలయంలో శుక్రవారం చిత్రీకరించారు. కిల్లోయి గ్రామానికి చెందిన డాక్టర్ తిరుపతిరావుసాహు నిర్మాణ, నిర్మాత, దర్శకత్వం బాధ్యతలతో పాటు దుర్యోధనుడు పాత్రను పోషిస్తున్నారు. భీముడిగా బొగాబంద గ్రామానికి చెందిన చలనచిత్ర నటుడు డాక్టర్ కుమార్‌నాయక్, కృష్ణునిగా దుదిష్టరభంజ్ సామంత, ధర్మరాజుగా దేవేంద్రశర్మ, శకునిగా రోషన్‌సుభాష్ సాహు, అర్జునుడిగా నల్ల నీలకంఠపతి, భీష్మునిగా రాజేంద్రపతి పాత్రలు పోషిస్తున్నారు.

సబ్సిడీపై కిటికీల పంపిణీ


కిటికీలు అందిస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: పలాస మండలం పరిధిలో జగనన్నకాలనీలు, సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి హౌసింగ్ కార్యాలయం వద్ద శుక్రవారం రాయితీపై అల్యూమినియం కిటికీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఈ వైకుంఠరావు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి కిటికీలు, ద్వారాలు, విద్యుత్ పరికరాలు, ప్లంబింగ్ సామగ్రిని సబ్సిడీపై అందజేస్తున్నట్లు చెప్పారు.

జన సంక్షేమమే లక్ష్యం


బ్రోచర్ అందజేస్తున్న పిరియా విజయ, సాయిరాజ్

ఇచ్ఛాపురం రూరల్: భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌ను సుస్థిరంగా సుభిక్షంగా ఉంచే శక్తి ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఉంటుందని, జన సంక్షేమమే జగనన్న లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ అన్నారు. శుక్రవారం మండపల్లిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌తో కలిసి పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాసురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ పిట్ట శశిరేఖ, ఏఎంసీ చైర్మన్ బాబూరావు, వైస్ ఎంపీపీలు దువ్వ వివేకానందరెడ్డి, దున్న గురుమూర్తి, మండల, మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షులు పి.రాజశేఖరరెడ్డి, బి.ప్రకాశ్‌పట్నాయక్, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, పిట్ట మామయ్య, చాట్ల తులసీదాసురెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు


మాత్రలు పంపిణీ చేస్తున్న జేసీఎస్ ఇన్‌చార్జి మోహన్, వైద్య సిబ్బంది

నందిగాం: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యానికి ఎంతో భరోసా కలుగుతుందని నందిగాం మండల జేసీఎస్ ఇన్‌చార్జి జె.జయరాం అన్నారు. శుక్రవారం నందిగాంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌టీ లైన్ ఏర్పాటుపై ఫిర్యాదు

టెక్కలి: ఎటువంటి సమాచారం లేకుండా తన స్థలంలో అన్యాయంగా విద్యుత్ హెచ్‌టీ లైన్లు వేయడంపై విద్యుత్ శాఖా సీఎండీకి ఫిర్యాదు చేసినట్లు టెక్కలి మండలం తొలుసూరుపల్లి గ్రామానికి చెందిన ధవళ హరి శుక్రవారం తెలిపారు. రావివలస విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి లింగాలవలసకు విద్యుత్ సరఫరా జరుగుతున్న హెచ్‌టీ లైన్లు తొలుసూరుపల్లి వద్ద ఇటీవల మార్పులు చేశారు. అయితే కొంత మందికి అనుకూలంగా ఉండేందుకు తన స్థలం మీదుగా విద్యుత్ లైన్లు వేశారని, తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మామిడి చెట్ల కొమ్మలను నరికేసి అన్యాయంగా హెచ్‌టీ లైన్లు వేశారని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

పలాస: మామిడిపల్లిలో శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ మద్దిల పాపారావు చెప్పారు. ఈ మేరకు క్రీడా మైదానంలో శుక్రవారం ఏర్పాట్లు పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో 20 జట్లు పాల్గొంటాయని చెప్పారు. మంత్రి సీదిరి అప్పలరాజు పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు.

కల్వర్టుకు మరమ్మతులు


మరమ్మతులు పరిశీలిస్తున్న నాయకులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 12వ వార్డులో కల్వర్టు కూలిపోవడంతో ఎస్సీ వీధిలో శుక్రవారం వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మురుగునీరు రోడ్డుపైకి రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ పోతనపల్లి ఉమా, పట్టణ యువజన విభాగ అధ్యక్షుడు పోతనపల్లి హరిప్రసాద్ తక్షణమే మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది సహకారంతో సొంతఖర్చులతో మరమ్మతులు చేయించారు. ప్రయాణికుల రాకపోకలకు, మురుగు ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా చేశారు.

ఆదర్శంగా జగనన్న ఆరోగ్య సురక్ష


సంతబొమ్మాళి: మందులు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో ఉమాసుందరి


వజ్రపుకొత్తూరు: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ తనిష్క

వజ్రపుకొత్తూరు: మండలంలోని మంచినీళ్లపేటలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ వంక రాజు ప్రారంభించారు. 296 మంది రోగులకు వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ తనిష్క వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

సంతబొమ్మాళి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎంపీడీవో ఉమాసుందరి అన్నారు. మర్రిపాడులో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రమీల, నందిని, వైద్యసేవలందించారు.

కొత్తమ్మ తల్లి హుండీ కానుకల లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: మండల కేంద్రం కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి హుండీ కానుకల ఆదాయాన్ని శుక్రవారం అసిస్టెంట్ జిల్లా దేవదాయశాఖాధికారి జి.వి.బి.ఎస్.రవి కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. 69 రోజులకు గాను రూ.4లక్షల67వేల 269 ఆదాయం వచ్చినట్లు ఈఓ వి.రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బోయిన మాధవి కృష్ణారావు, సభ్యులు బెవర పుణ్యావతి, సకలాభక్తుల తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎంజేవై హెల్త్‌కార్డులతో భరోసా

ఇచ్ఛాపురం రూరల్: పీఎంజేవై కార్డుల ద్వారా రూ.5లక్షల వరకు ఉచిత వైద్య సేవలు పొందవచ్చని జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ పాగిరి ప్రకాశరావు అన్నారు. శుక్రవారం కొళిగాం, పాయితారి, కీర్తిపురం గ్రామాల్లో ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధిపొందిన రోగులు, పీఎంజేవై కార్డుదారులను కలిశారు. ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యశ్రీ యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్ మండలా, ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, డాక్టర్ వై.కల్యాణి, డాక్టర్ రేవతి భేరి, ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్స్ శ్యామ్, వెంకటరమణ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి


విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ రజని

కంచిలి: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పైల రజని అన్నారు. కళాశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ డే నిర్వహించారు. చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇక్కడ పనిచేసి ఇతర కాలేజీలకు బదిలీ అయిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మందస కళాశాల ప్రిన్సిపాల్ శరత్‌బాబు, సోంపేట కళాశాల తెలుగు అధ్యాపకుడు మోహనరావు, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సీతారాంనాయుడు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి రూ.1.30 లక్షల సాయం


బాలుడి తండ్రికి నగదు అందజేస్తున్న రోహిణిశంకర్

మందస: మండలంలోని కుంటికోట గ్రామంలో నారాయణ హైస్కూలు యాజమాన్యం మానవత్వాన్ని చాటుకుంది. కిడ్నీబాధిత బాలునికి ఆర్థిక సాయం అందజేసింది. సోంపేట మండలం పాలవలసకు చెందిన టైలర్ వల్లభరావు 11 ఏళ్ల కుమారుడు పూర్ణసాయి అనారోగ్యానికి గురి కావడంతో వైద్య పరీక్షలు చేయించారు. రెండు కిడ్నీలు పాడైనట్లు వైద్యులు చెప్పారు. పేద కుటుంబం కావడంతో చికిత్సకు ఇబ్బందులు పడుతుండటంతో కుంటికోట నారాయణ హైస్కూల్ కరస్పాండెంట్ గుంట రోహిణిశంకర్ శుక్రవారం రూ.1.30 లక్షలను పూర్ణసాయి తండ్రి వల్లభరావుకు పాఠశాలలో అందజేశారు. యాజమాన్యం, విద్యార్థులు చేసిన సాయానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన కుమార్తె గీతికకు పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం ఉచితంగా విద్య అందజేస్తామని రోహిణి చెప్పారు. కార్యక్రమంలో గుంట అరవింద్, బుద్ధసూర్య, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమైన ఆహారం అందించడమే లక్ష్యం


విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

కోటబొమ్మాళి: రాష్ట్రంలోని పేదలకు, విద్యార్థులకు కల్తీ లేని స్వచ్ఛమైన రేషన్, ఆహార పదార్థాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు చెప్పారు. శుక్రవారం కోటబొమ్మాళి హైస్కూల్‌లో జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించారు. అనంతరం చీపుర్లపాడు రేషన్ డిపోను తనిఖీ చేశారు. కోటబొమ్మాళి కేజీబీవీ, ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను తనిఖీ చేసి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ టి.త్రినాథరావు, ఏఎస్‌డబ్ల్యూఓ డి.వి.ప్రసాదరావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి జి.శ్రీరాములు, తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ కె.రాజారమేష్, సివిల్ సప్లయ్ డీటీ కె.రాము, హాస్టల్ వార్డెన్ కె.సీతారాం, హెచ్‌ఎం డి. గోవిందరావు, ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రశాంతి పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమమే ధ్యేయం


మగ్గాలను అందజేస్తున్న ఎంపీపీ శ్రీరామ్మూర్తి

నందిగాం : చేనేత కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని నందిగాం ఎంపీపీ నడుపూరి శ్రీరామ్మూర్తి అన్నారు. పెద్దతామరపల్లిలో శుక్రవారం చేనేత కార్మికులకు ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన మగ్గాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికులకు ఏటా నేతన్న నేస్తం పథకం వర్తింపజేస్తున్నారని తెలిపారు. 50 ఏళ్లు నిండిన కార్మికులకు పింఛన్, 100యూనిట్లులోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ ధర్మారావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు తమిరి ఫల్గుణరావు, జేసీఎస్ కన్వీనర్ జద్యాడ జయరాం, పార్టీ నాయకులు తమిరి దేవేంద్రరావు, సైలాడ లావన్న, విష్ణు, టి.రామారావు, ఎర్రన్న, పెద్ద తామరపల్లి చేనేత సొసైటీ అధ్యక్షుడు బొచ్చ కృష్ణ, మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యం


కేదారిపురంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పిరియా విజయ, సాయిరాజ్

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ అన్నారు. శుక్రవారం కేదారిపురంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం జాతీయ రహదారి నుంచి ముచ్చింద్ర వరకు కోటి రూపాయలతో తారు రోడ్డు, జెడ్పీ నిధులు రూ.10లక్షలతో టి.బరంపురం సీతారాముల ఆలయం వద్ద కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఆర్‌అండ్‌బీ డీఈ ఎస్.రామినాయుడు, జేఈ మోహనరావు, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు పి.రాజశేఖరరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎన్.బాబూరావు, సర్పంచ్‌లు సీలాపు సారథిరెడ్డి, సాడి గురుమూర్తి, వైస్ ఎంపీపీలు డి.వివేకానందరెడ్డి, డి.గురుమూర్తి, కౌన్సిలర్లు బచ్చు జగన్, సుగ్గు ప్రేమ్‌కుమార్, నర్తు శివాజీ, సల్ల దేవరాజు, కారంగి మోహనరావు, దక్కత నూకయ్యరెడ్డి, సీలాపు ఢిల్లీ, చాట్ల తులసీదాస్‌రెడ్డి, కాళ్ల సత్యరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

బొలేరో బోల్తా-డ్రైవర్‌కు గాయాలు

మందస: కొర్రాయిగేటు సమీపంలోని పాతకమలాపురం గల జాతీయ రహదారిపై శుక్రవారం వేకువజామున బొలేరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. కోటబొమ్మాళి నుంచి ఇచ్ఛాపురం వైపు జొన్నపొత్తుల లోడుతో వెళ్తున్న ఈ వాహనం కొర్రాయిగేటు సమీపానికి వచ్చేసరికి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. రోడ్డుపై అడ్డంగా బోల్తా పడింది. డ్రైవర్ కె.విశ్వనాథ్ కేబిన్‌లో ఇరుక్కుపోగా, తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది బి.సంతోష్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, బాబురావు, చలపతిరావు, దమయంతి, సరోజని ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. మందస పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.